బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 03 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## మరో రెండు రోజులు వర్షాలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మరో రెండు రోజులపాటు ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కింది స్థాయి గాలులు ప్రధానంగా పశ్చిమ వాయువ్య దిశల నుండి వీస్తున్నట్టు తెలిపింది. గురువారం ఉరుములు మెరుపులతో పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ , కామారెడ్డి, మమబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ , వనపర్తి, నారాయణపేట్ , జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ నగరం పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా సంగారెడ్డిలో 107 మి.మి వర్షం కురిసింది. మొగ్ధంపల్లిలో 98.,హత్నూరలో 61.7, కామారెడ్డి జిల్లా గాంధారలో 50 మి.మి చొప్పున వర్షం కురిసింది.



# గాంధీ భవన్ ముట్టడి

- జీఓ 317 బాధితుల ఆందోళన
- రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులతో నిరసన
- 10 నెలలు అయినా తమ సమస్యను పరిష్కరించలేదని ఆవేదన
- 317 జీవోపై ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్
- భారీగా స్తంభించిన ట్రాఫిక్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాంపల్లిలోని గాంధీ భవన్‌ను జీఓ 317 బాధితులు ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే జీవో 317 బాధితుల సమస్యను పరిష్కరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని బాధితులు ప్రశ్నించారు. జీవోకు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రోడ్డుపై వారు బైటాయిం చడంతో ట్రాఫిక్ జామైంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.

ఈ సందర్భంగా పలువురు బాధితులు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 317 బాధితుల సమస్యను పరిష్కరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి పది నెలలైనా తమ సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిటీ వేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 317 జీవోపై ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దసరాలోగా కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి జీవో 317 బాధితులను స్థానిక జిల్లాలకు పంపేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికులకు అన్యాయం జరిగిందని, దీని సరిచేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

# మహాత్మా గాంధీ జీవితం స్ఫూర్తి దాయకం


- గాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు నివాళి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మహాత్మా గాంధీ జీవితం స్ఫూర్తి దాయకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌లో గల గాంధీ విగ్రహానికి, బాపు సమాధి వద్ద బుధవారం పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మేయర్ జి.విజయలక్ష్మి, మాజీ ఎంపీ హనుమంతరావు, ఇతర ప్రజా ప్రతినిధులు గాంధీకి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, అహింసా వాదిగా యావత్ భారతాన్ని ప్రభావితం చేసిన ఆయన వ్యక్తిత్వం, ఉద్యమ కార్యాచరణ మనందరికి స్ఫూర్తిదాయక మన్నారు. అంతకుముందు గాంధీ మ్యూజియంలో ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ డాక్టర్ జితేందర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఉన్నతాధికారులు, జీహెచ్‌ఎంసీ, వివిధ శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.

మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు.
బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



## మూసీ నిర్వాసితులకు శుభవార్త

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.వారికి డబుల్ బెడ్ రూమ్ ఇంటితోపాటు రూ.25,000 ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛందంగా మరో ప్రాంతానికి తరలివెళ్లే మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రతి కుటుంబానికీ డబుల్ బెడ్ రూమ్ ఇంటితో పాటు వేరే ప్రాంతానికి స్థానచలనం చెందినందుకు నిర్వాసితులకు రూ.25వేల పారితోషికం ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు.

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లతోపాటు తక్షణ సాయం అందజేత దిశగా సర్కార్ నిర్ణయించింది. ఈ చర్య బాధితులకు కొంత ఉపశమనంగా మారనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదివరకే సామాన్యులపై కొంత ఉదారత చూపిన ప్రభుత్వం ఇకపై పునరావాసానికి పస్రాధాన్యతనిచ్చి వారికి ఆశ్రయం కల్పించేందుకు, ఆర్థికంగా ఆదుకునేందుకు యోచిస్తోంది.

# సమంత - నాగ చైతన్య విడిపోడానికి కారణం కేటీఆర్

- నాడు సీతక్క, విజయలక్ష్మి
- నేడు నాపై అసభ్యకర పోస్టులు
- హీరోయిన్లు తొందరగా పెండ్లి చేసుకోవడానికి కారణం కూడా కేటీఆర్
- హీరోయిన్ల ఫోన్లు ట్యాప్.. కేటీఆర్ బ్లాక్ మెయిలింగ్
- చాలా మందికి డ్రగ్స్ అలవాటు చేశారు
- మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన తీరుతో సినీ పరిశ్రమలో కొంతమంది ఇబ్బంది పడ్డారన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు. బీసీ మహిళనైన తనపై అసభ్యకర పోస్టులు పెట్టడం బాధాకరమని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచేలా పోస్టులు పెట్టాలని కేటీఆరే ఆ పార్టీ కార్యకర్తలకు చెప్పినట్లు ఉందన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్? అనేక మంది సినిమా హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు.

సమంత – నాగ చైతన్య విడిపోడానికి కారణం కేటీఆర్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 10 ఏళ్లలో అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేయలేదని చెప్పిన కొండా సురేఖ.. దానికి కారణం కేటీఆర్ పెట్టిన ఒక కండీషన్ అని అన్నారు. అప్పుడు అక్కినేని నాగార్జున కోడలు, నాగచైతన్య భార్యగా ఉన్న సమంత విషయంలో కేటీఆర్ ఒక షరతు పెట్టినట్లు చెప్పారు. ఆ కండీషన్‌కు ఒప్పుకుంటే ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతలు ఆపుతామని చెప్పారని.. ఆ విషయంలో అక్కినేని కుటుంబం కూడా సమంతపై ఒత్తిడి తీసుకువచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

అలాగే సినిమా ఇండస్ట్రీలో మరికొంతమందిని ఫోన్ ట్యాపింగ్ ద్వారా అందరినీ ఇబ్బందులకు గురిచేశారన్నారు. హీరోయిన్స్ తొందరగా పెళ్లిళ్లు చేసుకుని సినిమాలు విడిచి వెళ్లిపోవడానికి కేటీఆర్ కారణమని ఆరోపించారు. కేటీఆర్ మత్తు పదార్థాలకు అలవాటు పడి వారిని కూడా మత్తు పదార్థాలకు అలవాటు చేసి రేవు పార్టీలు పెట్టారని విమర్శించారు. బ్లాక్ మెయిల్ చేసి వాళ్ల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు.

మహిళలను కించపరిచేలా పోస్టులు పెట్టమని కేటీఆర్ తన టీమ్‌కు చెప్పినట్లు ఉన్నారన్నారు. అకౌంట్ ఆయనది కాదు అన్నప్పుడు వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పాలి కదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో తాను ఐదేళ్లు పని చేశానని తన వ్యక్తిత్వం అందరికీ తెలుసని కొండా సురేఖ అన్నారు. కేటీఆర్‌కు తల్లి అక్క, చెల్లెలు లేరా అని ప్రశ్నించారు. రాజకీయ విలువలు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తప్పు చేస్తే ఎత్తి చూపాలి తప్పితే వ్యక్తుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా నుంచి అసభ్యకరమైన పోస్టులు వస్తే ఊరుకునేలేదని హెచ్చరించారు.

నా వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెడుతున్నారు. ఆ పోస్టులను కేటీఆర్ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాం. పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు పెడతాం అని అన్నారు. గతంలో మంత్రి సీతక్క, మేయర్ విజయలక్ష్మి మీద అసభ్యకరంగా పోస్టులు పెట్టారనీ, ఇప్పుడు బీసీ మహిళనైన తనపై అసభ్యకరంగా పోస్టులు పెట్టడం బాధాకరం అన్నారు.

## సినీ ఇండస్ట్రీ మహిళలను చిన్నచూపు చూడటం మానేయండి

- మా విడాకుల విషయంలో
- రాజకీయ నాయకుల ప్రమేయం లేదు.
- విడాకులు నా వ్యక్తి గత విషయం
- మీ రాజకీయాల్లోకి నన్ను లాగొద్దు.
- నటి సమంత

వివరాలు 2వ పేజీలో

## మంత్రి వ్యాఖ్యలు అత్యంత దారుణం

- ఆమె వ్యాఖ్యలు బాధించాయి
- సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలను హెడ్‌లైన్స్ కోసం ఉపయోగించుకోవద్దు
- అవి పూర్తిగా నిరాధరమైన ఆరోపణలు
- నటుడు నాగ చైతన్య

వివరాలు 2వ పేజీలో

## కొండా సురేఖ వ్యాఖ్యలను ఖండిస్తున్నా

- నటుడు నాగార్జున

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు నటుడు నాగార్జున పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి అని హితవు పలికారు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండని సూచించారు. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం అని నాగార్జున స్పష్టం చేశారు. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలిసిందిగా కోరుతున్నాను అని కొండా సురేఖకు నాగార్జున పేర్కొన్నారు.

## సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే చిన్నచూపా..?

- నటుడు ప్రకాశ్‌రాజ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మంత్రి కొండా సురేఖపై ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగచైతన్య, సమంత జంట విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ‘ఏంటీ సిగ్గులేని రాజకీయాలు. సినిమాల్లో నటించే ఆడవాళ్లంటే చిన్నచూపా? బాధ్యతగల మంత్రి స్థానంలో కొనసాగుతున్న మీరు చేసిన వ్యాఖ్యలు సరికాదు. వెంటనే వాటిని ఉపసంహరించుకోండి” అని సూచించారు.

# మంత్రి కొండా సురేఖకు కేటిఆర్ లీగల్ నోటీస్

- 24 గంటల్లోగా క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేయడంతో పాటు క్రిమినల్ కేసు వేస్తాం
- మాజీ మంత్రి కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫోన్ టాపింగ్ చేశారనీ, , నాగచైతన్య సమంత విడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్ అంటూ. వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపారు. తనపై కొన్ని దుర్వేశపూర్వక వ్యాఖ్యలు చేశారని, కేవలం తన గౌరవానికి ఈ ఇమేజ్కి భంగం కలిగించాలన్న లక్ష్యంగానే సమంత-నాగచైతన్య పేర్లను తీసుకుంటూ సురేఖ అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసులో కేటీఆర్ పేర్కొన్నారు

తనకు సంబంధం లేని ఫోన్ ట్యాపింగ్‌పై అసత్యాలు మాట్లాడరని మండిపడ్డారు. కేవలం రాజకీయ కక్షతో, రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును కొండా సురేఖ వాడుకుంటున్నారని.. మహిళ అయిఉండి సాటి మహిళ పేరును, సినిమా నటుల పేరును వాడుకొని వారి వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడడం దురదృష్టకరమన్నారు.అసలు తనకు సంబంధమే లేని ఫోన్ టాపింగ్, ఇతర అంశాలపైన కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలు అసత్యపూరితమని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఒక మంత్రిగా కొండా సురేఖ తన మంత్రి హెూదాను దుర్వినియోగం చేశారన్నారన్నారు. ఎలాంటి సాక్షాలు లేకుండా కొండా సురేఖ చేసిన అసత్య పూరిత వ్యాఖ్యలు, దురుద్దేశ పూరిత మాటలు మీడియా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయని.. ఎలాంటి సాక్ష్యాధారాలు చూపించకుండా అడ్డగోలుగా మాట్లాడిన కొండ సురేఖ ఒక మంత్రి అని, ఆమె చేసిన వ్యాఖ్యలను సాధారణ ప్రజలు నిజాలుగా భ్రమపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రిగా తన సహచర అసెంబ్లీ సభ్యుడనే సోయి లేకుండా మాట్లాడడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. గతంలో ఇవే అడ్డగోలు మాటలు మాట్లాడిన కొండా సురేఖకు ఏప్రిల్‌లో నోటీసులు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇలాంటి అవాంఛనీయ వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖకు భారత ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక చేసిందని.. అయినా ఇలాంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలను కొనసాగిస్తున్నరన్నారని మండిపడ్డారు. కొండ సురేఖ ప్రణాళికబద్ధంగా కావాలనే పదేపదే అవే అబద్ధాలను వ్యక్తిత్వాన్ని తగ్గించడం కోసం, నష్టపరచడం కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు, అసత్యాలు దురుద్దేశపూర్వకంగా మాట్లాడినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి దురుద్దేశపూర్వక, చిల్లర మాటలు మాట్లాడవద్దని హెచ్చరించారు. 24 గంటల్లోగా క్షమాపణ చెప్పకుంటే చట్ట ప్రకారం పరువు నష్టం దావాను వేయడంతో పాటు క్రిమినల్ కేసు వేస్తామని స్పష్టం చేశారు.

# దుండిగల్‌లో శ్రీ దత్త సభా మంటపాన్ని ప్రారంభించిన సీఎం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఏ రాష్ట్రంలో అయితే ప్రశాంతమైన వాతావరణం నెలకొని, సంప్రదాయాలు కాపాడబడుతాయో, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించే వాళ్లకు ఎక్కడైతే గౌరవం దక్కుతుందో ఆ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్త సభా మంటపాన్ని ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారు తెలంగాణకు విచ్చేసినందుకు రాష్ట్ర ప్రజల తరపున వారికి క ృ త జ్ఞ త ల ు తెలియజేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రజలం దరికీ ముఖ్యమంత్రి గారు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మైసూర్‌లో జరగాల్సిన దసరా నవరాత్రి ఉత్సవ కార్యక్రమాలను స్వామీజీ వారు ఇక్కడ నిర్వహించడం తెలంగాణకు శుభ సూచకమని పేర్కొన్నారు.

శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీ (బాల స్వామీజీ)తో పాటు ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.వేదవ్యాస మహర్షి విరిచితమైన శ్రీమద్భాగవతానికి పరమపూజ అప్పాజీ గారు రాసిన వ్యాఖ్యాన పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.



# పండుగలకు అన్ని ఏర్పాట్లు ఘనంగా చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రెటరీలతో కలెక్టర్ సమీక్ష




**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట:**
బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు అన్ని ఏర్పాట్లు ఘనంగా చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇన్చార్జి డిపిఓ శేషాద్రి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రెటరీలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండలాల్లోని ప్రతి గ్రామం వారిగా పారిశుధ్య పనులు, ఇంటి పన్ను వసూలు ఇతర అంశాలపై పంచాయతీ సెక్రెటరీ, ప్రత్యేక అధికారి, ఇతర అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చర్చించారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బతుకమ్మ దసరా దీపావళి పండుగల సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న స్పెషల్ ఆఫీసర్లు, ఇన్చార్జిలు ఏమైనా సమస్యలు ఉంటే నేటి నుంచే వాటిని పరిష్కరిస్తూ పండగ నాటికి సరియైన ఏర్పాట్లు చేయాలని అన్నారు . ఆయా వేడుకల కోసం గ్రామాల్లో ప్రధాన కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని,రోజూ గ్రామాల్లో శానిటేషన్ పనులు నిర్వహించాలని, పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా ఉండేలా చూడాలని,వీధిలైట్లు వెలిగేలా చూడాలని అన్నారు.గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఇంటి పన్ను క్రమం తప్పకుండా వసూలు చేయాలనిఅన్నారు .

**ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి..**
ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఇప్పటివరకు ఎన్ని పరిష్కరించారు, ఆయా మండలాల తహసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం 5,017 దరఖాస్తులు రాగా, ఇప్పటిదాకా 857 పరిష్కరించామని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల ప్రభుత్వ నిబంధనల ప్రకారం రానున్న నెల రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు సత్తయ్య, రాజేందర్, రఘురాం, తహసిల్దార్లు రాంచంద్రం, సురేష్, మారుతి రెడ్డి, ఎంపీఓ లు రాజు, వీరయ్య, వాజిద్, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఎస్పీ అఖిల్ మహాజన్




**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**
మహిళలను ,విద్యార్థినుల వేధించిన, వెంబడించిన సామాజిక మధ్యమాల ద్వారా వేధించిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇల్లంతకుంట మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద ఉదయం,సాయంత్రం సమయంలో బైక్ లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థినిలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా షీ టీమ్ కి సమాచారం ఇవ్వగా మంగళవారం సాయంత్రం జిల్లా షీ టీం సిబ్బంది కాలేజ్ వద్ద మఫ్టీలో ఉండగా బైక్ పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న ఇద్దరు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్ పట్టుకొని వారిపై పెట్టి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

మహిళలు మరియు చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని , జిల్లాలో విద్యసంస్థల వద్ద రద్దీగల ప్రదేశాల్లో షీ టీమ్ సిబ్బంది మఫ్టీలో నిరంతరం నిఘా ఉంచుతూ ఈ సంవత్సరం మహిళలను, విద్యార్థినులకు వేధిస్తున్న పోకిరీలపై 37 కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని,మూడు నెలల వ్యవధిలో మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న 22 మందిని అదుపులోకి తీసుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి మరల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా జిల్లా షీ టీమ్ ని సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు షీ టీమ్ నంబర్ 87126 56425 డయల్ 100 కు సమాచారం ఇవ్వలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడతాయని తెలిపారు.



## ఘనంగా మహాత్మగాంధీ జయంతి వేడుకలు..

**నివాళులు అర్పించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**
స్వాతంత్ర్య సమర యోధుడు, జాతిపిత మహాత్మగాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో మహాత్మగాంధీ జయంతి వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు జాతిపిత చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిరిసిల్లలోని గాంధీ చౌక్ లో ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఇక్కడ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ దీపాలు ఏర్పాటు.. పరిసరాల పరిశుభ్రత..





**బలగం టీవీ , సిరిసిల్ల**
కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు వీర్నపల్లి మండల పరిషత్ అధికారులు విద్యాలయాల ఆవరణలో పలు పనులు చేపట్టారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇటీవల ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఆవరణ, బయట సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, ఆవరణ అంతా పరిశుభ్రంగా చేయించాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన గడ్డి, చెత్తాచెదారని తొలగించాలని సూచించారు. దీంతో ఎంపీడీవో రఘురాం, ఎంపీఓ వాజిద్ విద్యాలయాల్లో పనులు పూర్తి చేశారు.

# ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ..



- రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన సంబురాలు

**బలగం టీవీ, సిరిసిల్ల :**
ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్కజాములాయే చందమామ.. అంటూ మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆడపడుచులు ఉపవాసం ఉండి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం కూడళ్లు, ఆలయాల వద్ద బతుకమ్మలను పెట్టి ఆడగా, పాటలతో ఆలయాలు, వీధులన్నీ మార్మోగాయి.

## రాచకొండలో డీజే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదు : సీపీ సుధీర్‌బాబు




**బలగం టీవీ , హైదరాబాద్**
రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో మత పరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై నిషేధం పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజే సౌండ్‌ల నుంచి అధిక డెసిబుల్స్‌లో వచ్చే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధిత ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉండడంతో పాటు చిన్న పిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నట్లు పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయన్నారు. ప్రధానంగా వృద్ధుల ఆరోగ్యం దెబ్బ తింటుందనే కారణంతో రాచకొండ కమిషనరేట్ పరిధిలోలో ఉరేగింపుల్లో డీజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్, బాణా సంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ వివరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే బీఎస్ఎన్ 223, 280, 292, 293, 324, బీఎన్ఎస్ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు అతిక్రమించిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష జరిమాన ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్రజలకు, విధుల్లో ఉండే అధికారులకు కల్గుతున్న ఇబ్బందులు, డీజీ సౌండ్ సిస్టమ్‌తో తలెత్తుతున్న సమస్యలను విశ్లేషించి అందరి అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.



## సినీ ఇండస్ట్రీ మహిళలను చిన్నచూపు చూడటం మానేయండి : సమంత

**బలగం టీవీ , హైదరాబాద్**
టాలీవుడ్ యాక్టర్లు నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ చేసిన కామెంట్లపై రియాక్ట్ అయ్యారు సమంత. ఇండస్ట్రీలో పనిచేసే ఓ మహిళ గురించి ఇంత దారుణమైన వ్యాఖ్యలు చేస్తారా? ఆమె జీవితాన్ని మీ రాజకీయం కోసం బజారున పెడతారా? అంటూ ఆవేదన వ్యక్తంచేసింది.

"నేను సినీ ఇండస్ట్రీలో ఉన్నందుకు గర్వపడుతున్నా. ఇండస్ట్రీ మహిళలను చిన్నచూపు చూడటం మానేయండి. ఒక మహిళగా బతకడానికి బయటకు వచ్చి పోరాడటానికి చాలా ధైర్యం కావాలి.. ఈ ప్రయాణంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొన్నందుకు గర్వపడతాను. ఇలాంటి గ్లామర్ ప్రపంచంలో రాణించాలంటే చాలా శక్తి కావాలి. ఒక మంత్రిగా మీ మాటలకు గౌరవం ఉంటుందనే విషయాన్ని గ్రహించాలి. ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడే ముందు గౌరవంగా.. బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. విడాకులు నా వ్యక్తి గత విషయం. ఇద్దరు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నాం. నేనెప్పుడూ రాజకీయాలకు దూరంగా ఉంటా. మీరు గౌరవప్రదమైన మంత్రి పదవిలో ఉన్నారు. మీ రాజకీయాల్లోకి నన్ను లాగొద్దు. మా విడాకుల విషయంలో రాజకీయ నాయకుల ప్రమేయం లేదు. ఇతర వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు" అని సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.


To be a woman,
To come out and work,
To survive in a glamorous industry where women are more often than not treated as props,
To fall in love & to fall out of love,
To still stand up and fight...

It takes a lot of courage and strength. Konda Surekha Garu, I am proud of what this journey turned me into- please don't trivialise it. I hope you realise that your words carry significant weight as a minister. I implore you to be responsible and respectful of individuals' privacy.

My divorce is a personal matter, and I request that you refrain from speculating about it. Our choice to keep things private doesn't invite misrepresentation.

To clarify: my divorce was mutual consent and amicable, with no political conspiracy involved.

Could you please keep my name out of political battles? I have always remained non-political and wish to continue doing so.

- Samantha


# సంక్రాంతికే విశ్వంభర

**బలగం టీవీ , హైదరాబాద్**
మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం విశ్వంభర. మల్లిడి వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండటమే కాకుండా, చిరంజీవి పాత్ర గురించి అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.సోషియో ఫాంటసీ జానర్ లో భారీగా తెరకెక్కుతోంది. త్రిష ప్రధాన హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల విశ్వంభర సినిమా ఓటీటీ డీల్ వలన ఆలస్యం అవుతుందనే టాక్ వినిపించింది. ఓటీటీ డీల్ కారణంగా కొంత ఆగి సినిమాను విడుదల చేస్తారనే ప్రచారం తెరపైకి వచ్చింది. తాజాగా ఈ టాక్ పై యూవీ క్రియేషన్స్ నిర్మాణ సంస్థ స్పష్టత ఇచ్చింది. విశ్వంభర సినిమాకు సంబంధించి ఎలాంటి ఆలస్యం ఉండదని, సంక్రాంతికి అనుకున్న విధంగానే సినిమా విడుదలవుతుందని అధికారికంగా క్లారిటీ ఇచ్చింది. ఓటీటీ డీల్ పై చర్చలు జరిగినా, ఆ డీల్ పూర్తయినా లేదా కుదరకపోయినా, విశ్వంభర సినిమా విడుదల తేదీలో మార్పు ఉండబోదని స్పష్టం చేసింది.

దర్శకుడు మల్లిడి వశిష్ట కూడా ఇదివరకే సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "10-1-2025 విజృంభణం.. విశ్వంభర ఆగమనం!!" అంటూ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 10 థియేటర్లలో విడుదల కానుందని స్పష్టం చేశారు. ఇక విశ్వంభర సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయినట్లు సమాచారం. ఒక పాట, కొంత టాకీ పార్ట్ మాత్రమే పెండింగ్ లో ఉందని సమాచారం. అలాగే, వీఎఫ్ఎక్స్ పనులు, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా జరుగుతున్నాయి.




## మీ వంశానికి మూల పురుషుడి పేరు తెలుసుకోండి




**బలగం టీవీ , హైదరాబాద్**
శ్రీ విష్ణు హీరో నటిస్తోన్న తాజా చిత్రం స్వాగ్ ). హసిత్ గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రీతూ వర్మ, దక్షా నగార్కర్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. స్వాగ్ అక్టోబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్య ంలో శ్రీవిష్ణు టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. తాజాగా మరో ప్రమోషనల్ వీడియోను షేర్ చేశారు మేకర్స్.

"మన నాన్నగారి పేరు అందరికి తెలుసు.. మన తాతగారి ఆల్‌మోస్ట్ అందరికీ తెలుసు. మరి వాళ్ల నాన్న పేరు.. వాళ్ల నాన్న పేరు.. వాళ్ల వాళ్ల నాన్న గారి పేరు.. మన వంశానికి మూల పురుషుడి పేరు.. తెలియదా.. తెలుసుకోండి.. తెలుసుకోవడానికి ప్రయత్నించండి. తెలుసుకొని మాకు పోస్ట్ చేయండి.. ఎందుకంటే మా సినిమా తరాల గురించి.. తరతరాల గురించి.. స్వాగణిక వంశంలో జరిగిన కథ గురించి.." అంటూ శ్రీవిష్ణు చిట్‌చాట్‌తో విడుదల చేసిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

చారిత్రక నేపథ్యం ఉన్న శ్వాగణిక వంశం కథ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. స్వాగ్ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన బాబా సెహెగల్ సింగరో సింగ సాంగ్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది.

## మంత్రి వ్యాఖ్యలు అత్యంత దారుణం : నాగ చైతన్య



**బలగం టీవీ , హైదరాబాద్**
తమ విడాకులపై రాజకీయాల్లోకి తెలంగాణ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగచైతన్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు తనను బాధించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. జీవితంలో విడాకుల నిర్ణయమనేది అత్యంత బాధాకరమైన విషయం. మీ వ్యాఖ్యలు సరైనవి కాదని పేర్కొన్నారు.'మా విడాకులపై గతంలో అనేక నిరాధారమైన ఆరోపణలు వచ్చాయి. మా కుటుంబంపై ఉన్న గౌరవంతో ఇన్నాళ్లు మౌనంగా ఉన్నా. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమే కాకుండా హాస్యాస్పదం. ఆమె వ్యాఖ్యలు అంగీకారం కాదు. సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలను హెడ్‌లైన్స్ కోసం ఉపయోగించుకోవద్దు' అని హితవు పలికారు. 'పూర్తిగా నిరాధారమైన ఆరోపణలు చేశారు. వాస్తవానికి దూరంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయి. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమే కాక అత్యంత దారుణమైన వ్యాఖ్యలు. ఇవి ఏమాత్రం సహించరానివి. మహిళలకు మద్దతుగా నిలవాలి.. గౌరవింపబడాలి. ప్రముఖుల వ్యక్తిగత జీవితాలను అడ్వాంటేజీగా తీసుకుని మీడియాలో హైలెట్ కావాలని చూడడం పూర్తిగా సిగ్గుపడాల్సిన విషయం' అంటూ నాగ చైతన్య మండిపడ్డారు. మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను అక్కినేని నాగార్జున, అక్కినేని అమల, నాగ సుశీల, సుశాంత్ తదితరులు తీవ్రంగా తప్పుబట్టారు.

# మూసీ బ్యూటిఫికేషన్ కాదు..
# మూసీ లూటిఫికేషన్

**మూసీపై రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తా**
**రాహుల్‌గాంధీనే హైడ్రాను నడిపిస్తున్నారు**
**కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి**
**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి చేపట్టింది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. మూసీ లూటిఫికేషన్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మూసీ సుందరీకరణపై డీపీఆర్ కాదు.. ప్రాజెక్టు రిపోర్టు కూడా లేదని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. మూసీ ప్రాజెక్టు కోసం డబ్బులు ఎక్కడ్నుంచి తెస్తారు..? అని నిలదీశారు. మూసీపై రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాను అని తెలిపారు. మూసీ విషయంలో సీఎంకు, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదన్నారు. మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లని ఎవరు చెప్పారని శ్రీధర్ బాబు అంటున్నారు. అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సీఎం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు అని కేటీఆర్ విమర్శించారు. డబ్బు సంచుల కోసమే మూసీ ప్రాజెక్టుకు రాహుల్ అనుమతి ఇచ్చారు.

రేవంత్ రెడ్డి కాదు.. రాహుల్ గాంధీనే హైడ్రాను నడిపిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. రాహుల్ వెనుకుండి పేదల ఇండ్లపైకి బుల్డోజర్ నడిపిస్తున్నారు. కేవలం డబ్బుల కోసమే మూసీ ప్రాజెక్టును రాహుల్ చేపట్టారు. బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ ఎక్కడున్నారు..? మూసీ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో త్వరలో బయటపెడుతా. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి.. కానీ బాధితుల కష్టాలు పట్టవా..? అని కేటీఆర్ నిలదీశారు.

# కేటీఆర్‌కు సోయి ఉందా

**హైడ్రాకు, రాహుల్ గాంధీకి సంబంధం ఏమిటి?**
**కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడో కేటీఆర్ చెప్పాలి**
**'హైడ్రా పని వేరు. మూసీ ప్రాజెక్ట్ వేరు'**
**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైడ్రాకు, రాహుల్ గాంధీకి సంబంధం ఏమిటి? అసలు కేటీఆర్‌కు సోయి ఉందా అంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణలో 800 చెరువులను కబ్జా చేశారని సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆయన కబ్జా చేశారు కాబట్టే బీఆర్‌ఎస్ నేతలకు హైడ్రా అంటే భయం అంటూ కామెంట్స్ చేశారు. తెలంగాణలో మూసీ, హైడ్రా కూల్చివేతలు, రాహుల్ గాంధీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. 'కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడో కేటీఆర్ చెప్పాలి. ఆయన ఏం చదువుకున్నాడో అని అనుమానం వస్తోంది. హైదరాబాద్ పరిధిలోని చెరువులకు పూర్వవైభవం తెస్తాం' అని తెలిపారు.

మూసీపై డీపీఆర్ సిద్ధం కానప్పుడు అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు మహేష్ గౌడ్. 2016లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూసీని ప్రక్షాళన చేస్తానని చెప్పి, ఏం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు సిద్ధంగా ఉందని, ప్రవాహానికి అడ్డుగా ఉన్న వాటిని మాత్రమే తొలగిస్తున్నారని వివరించారు. బయటి రాష్ట్రాల వీడియోలను ఇక్కడ ప్రచారం చేస్తున్నారని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న వాటిని మాత్రమే హైడ్రా కూల్చి వేస్తోందని తెలిపారు. 'హైడ్రా పని వేరు. మూసీ ప్రాజెక్ట్ వేరు' అని చెప్పారు. మూసీ పక్కన అక్రమంగా ఉన్న కట్టడాలను మాత్రమే తొలగిస్తున్నారని, ప్రజలను తప్పుతోవ పట్టించేందుకు లక్షల రూపాయలు సోషల్ మీడియాకు ఖర్చు బెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేరు మీద ఒక్క రూపాయి అనవసరంగా ఖర్చు పెట్టినట్లు ప్రూవ్ చేస్తే తాను మూసీలో దుకుతానని, లేదంటే కేటీఆర్ దూకాలని సవాల్ చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్న ఆయన, త్వరలోనే అఖిల పక్ష మీటింగ్ పెడతామన్నారు.

# వాళ్లు ఆడబిడ్డలు కాదా..

- **మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తప్పుబట్టారు. కేటీఆర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

సురేఖమ్మా, మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకోవడంలో ఉంటుంది, కేటీఆర్ గురించి మీరు మాట్లాడింది ఆక్షేపణీయమని పేర్కొన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలు చేయకూడదని, తిరిగి విమర్శించే ఆస్కారం ఇవ్వకూడదని అన్నారు. వ్యవస్థలో ఉన్న లోటుపాట్ల గురించి మాట్లాడాలని, తద్వారా సమాజానికి ఆదర్శంగా ఉండాలని హితవు పలికారు. మీరు చేసిన ఆరోపణ వల్ల కేటీఆర్ గారి అమ్మ, భార్య, బిడ్డ, చెల్లి బాధపడరా? వాళ్లు ఆడబిడ్డలు కారా? ఒక తోటి మహిళగా మీరు ఆలోచించారా? అని కొండా సురేఖను ఉద్దేశించి ప్రశ్నించారు. బాధ్యత గల పదవిలో ఉండి బాధ్యతారహితంగా మాట్లాడటం బాధాకరమన్నారు.

## కూల్చివేతలపై బీజేపీ కార్యచరణ ప్రకటిస్తాం

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



హైడ్రా, మూసీ కూల్చివేతల విషయంలో బీజేపీ కార్యచరణ గురువారం ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులయ్యే బాధితులను ఆదుకునేందుకుతమ పోరాటం ఉంటుందని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో బుధవారం కిషన్ రెడ్డి పర్యటించారు.అంబర్‌పేట్, అసెంబ్లీ, ముసారాంబాగ్, అంబేద్కర్ నగర్, తులసి నగర్ మీదుగా కృష్ణానగర్ వరకూ బస్తీలను సందర్శించారు.ఈ సందర్భంగా మూసీ నిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు అండగా ఉండటం కోసమే తాము చేపట్టేబోయే భవిష్యత్తు ప్రణాళిక ఉంటుంది. ఈసారి తాము ఏదీ చెప్పి చేయం. హైడ్రా కూల్చివేతలపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు. ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. ఇళ్ల కూల్చడంతో కేంద్రానికి ఏం సంబంధమో ఆయనే చెప్పాలి. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదు. పరస్పర రాజకీయ విమర్శలు తర్వాత చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల వేలాది మంది పేదలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. పేదలకు అండగా ఉండటం కోసం జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం. మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. మీ కోసం మేము నిలబడతాం. రేపట్నుంచే కొత్త కార్యచరణ అమలు చేయబోతున్నాం. కాంగ్రెస్ బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం. మీ ఆస్తులకు నష్టం జరగనివ్వం" అని హామీ ఇచ్చారు..

# ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఇజ్రాయెల్–హమాస్, హెజ్బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇప్పుడు ఇరాన్ కూడా ప్రత్యక్షంగా దిగింది. మంగళవారం సుమారు 500 క్షిపణులు, రాకెట్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. దీంతో టెల్ అవీవ్ బాంబుల మోతతో దద్దరిల్లింది. పలు భవనాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయి. పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఇజ్రాయల్ హెచ్చరికలు జారీ చేసింది. వేలాది మందిని బాంబు షెల్టర్లకు తరలించింది. దాడులను అడ్డుకోవడానికి తన రక్షణ వ్యవస్థను సిద్ధం చేసింది. లెబనాన్‌లో హెజ్బొల్లా నేతల మరణాలకు ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులకు దిగింది.

ఇరాన్ దాడులను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) కూడా ఎక్స్‌లో నిర్ధారించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ సాయంత్రం అత్యవసరంగా సమావేశమై పరిస్థితులపై చర్చించింది. ఏడాది కాలంలో సెక్యూరిటీ క్యాబినెట్ ఇలా సమావేశం కావడం ఇదే ప్రథమం. కాగా, దాడిని ఇరాన్ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌పై డజన్లకొద్దీ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ దాడులకు ఇజ్రాయెల్ ప్రతిస్పందిస్తే మరింత తీవ్రంగా దాడులు చేస్తామని హెచ్చరించింది.

ఇదిలావుండగా ఇజ్రాయెల్‌కు అమెరికా అండగా ఉం టుందని అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశా రు. అందుకోసం పశ్చిమాసియాలోని అమెరికా బలగాలను రక్షించుకునేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. జాతీయ భ ద్రతా విభాగంతో జరిగిన భేటీలో బైడెన్‌తో పాటు ఉపాధ్యక్షురాలు హారిస్ కూడా ఉ న్నారు.అంతకు కొన్ని గంటల ముందు ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణి దాడులకు ఇ రాన్ సన్నాహాలు చేస్తోందని అమెరికా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదే జరిగితే ఇ రాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది.

# నేటి నుంచే మహిళల ప్రపంచకప్..

## పొట్టి కప్ కోసం తలపడనున్న 10 జట్లు మొదటి టైటిల్ సన్నదమైన భారత్



**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల టీ20 ప్రపంచకప్ గురువారం (అక్టోబర్ 3) నుంచి ప్రారంభం కానుంది. యూఏఈ వేదికగా జరగనున్న ఈ టీ20 ప్రపంచకప్‌లో మొత్తం 10 జట్లు తలపడ నున్నాయి. ఈ జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. తొలి రౌండ్‌లో గ్రూపుల్లోని జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి.

గ్రూప్-ఎలో ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లు, గ్రూప్-బిలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నమెంట్ ఫైనల్ అక్టోబర్ 20న జరుగుతుంది.

టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ బంగ్లాదేశ్, స్కాట్లాండ్ మధ్య జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ స్టేజ్ మ్యాచ్‌ల అనంతరం రెండు గ్రూప్‌ల్లో టాప్-2లో ఉన్న జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

ఇక టీమ్‌ఇండియా మరోసారి టైటిల్ ఫేవరెట్ గా బరిలోకి దిగనుంది. 2020లో ఫైనల్ దాకా వెళ్లిన టీమ్‌ఇండియా ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఇక గతేడాది జరిగిన టోర్నీలో సెమీస్ లోనే నిష్క్రమించింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆసక్తికర పోరు భారత్, పాకిస్థాన్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ అక్టోబర్ 6న మధ్యాహ్నం 2 గంటలకు జరగనుంది. దుబాయ్‌లో ఇరు జట్లు తలపడను న్నాయి. ఇటీవల ఆసియా కప్‌లో ఇరు జట్లు తలపడగా, అక్కడ టీమ్‌ఇండియా గెలిచింది.

ఈ టీ20 ప్రపంచ కప్ లో భారత్ తన తొలి మ్యాచ్ ను అక్టోబర్ 4 న దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో న్యూజిలాండ్‌తో

### టీమిండియా షెడ్యూల్

(అన్ని మ్యాచ్‌లు ఇండియా సమయం ప్రకారం)

**4 అక్టోబర్, శుక్రవారం, భారత్ వర్సెస్ న్యూజిలాండ్, దుబాయ్, 7:30**

**6 అక్టోబర్, ఆదివారం, భారత్ వర్సెస్ పాకిస్థాన్, దుబాయ్, 3:30**

**9 అక్టోబర్, బుధవారం, భారత్ వర్సెస్ శ్రీలంక, దుబాయ్, 7:30**

**13 అక్టోబర్, ఆదివారం, భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా, షార్జా, 7:30**

# వామప్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం



**బలగం టీవీ, దుబాయ్**

మహిళల టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో ఇప్పటికే వెస్టిండీస్‌పై విజయం సాధించిన టీమ్‌ఇండియా. తాజాగా దక్షిణాఫ్రికాపై కూడా గెలిచింది. 28 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. తొలుత రీచాఘోష్(36), దీప్తిశర్మ(35 నాటౌట్), రోడ్రిగ్స్(30) రాణించడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో144/7 స్కోరు చేసింది.ఓపెనర్ షెఫాలీవర్మ(0) డకౌట్‌తో నిరాశపర్చగా, మందన(21) ఫర్వాలేదనిపించింది. కాకా(5/25) ఐదు వికెట్లతో విజృంభించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన సఫారీలు 20 ఓవర్లలో 116/6 స్కోరుకు పరిమితమయ్యారు. కెప్టెన్ లారా వోల్వార్ట్(29), కోల్ ట్రయాన్(24) మినహా పెద్దగా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. ఆశా శోభన(2/21) రెండు వికెట్లు తీసింది.

# కెప్టెన్సీకి బాబర్ గుడ్ బై..



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పాకిస్థాన్ స్టార్ ప్లేయర్ బాబర్ అజామ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పటికే టెస్టు ఫార్మట్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పేసిన బాబార్ తాజాగా వన్డే, టీ20 నాయకత్వ బాధ్యతల నుంచి కూడా తప్పుకున్నాడు. తన నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు కూడా తెలిపినట్లు చెప్పాడు. పాకిస్థాన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం దక్కడం తనకు ఎంతో గౌరవం అని అన్నాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

'డియర్ ఫ్యాన్స్, మీతో ఓ విషయం షేర్ చేసుకోవాల నుకుంటున్నాను. నేను పాకిస్థాన్ కెప్టెన్సీకి గుడ్ బై చెప్పేస్తున్నా. నా నిర్ణయాన్ని గతనెల పీసీబీ మేనేజ్‌మెంట్‌కు చెప్పాను. పాక్ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా చేసే అవకాశం దక్కడం గొప్ప గౌరవం. ఇదొక మంచి అనుభవం. కానీ, ఇది కాస్త పనిభారం పెంచుతుంది. నేను పూర్తిగా బ్యాటింగ్‌పై దృష్టి పెట్టాలనుకుంటున్నా. అలాగే నా కుటుంబంతో సమయం గడపాలనుకుంటున్నా. అందుకే కెప్టెన్సీ వదులుకుంటున్నా. ఓ ప్లేయర్‌గా పాకిస్థాన్ క్రికెట్‌కు నా అత్యుత్తమ ప్రదర్శనను అందిస్తా. ఇన్ని రోజులు నాకు మద్దతుగా నిలిచిన మేనేజ్‌మెంట్, ఫ్యాన్స్‌కు థాంక్స్' అని బాబర్ సోషల్ మీడియాలో పేర్కొన్నాడు.

బాబర్ 2019లో తొలిసారి కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్నాడు. అప్పట్నుంచి పాకిస్థాన్ జట్టును అన్ని ఫార్మాట్లలో సమర్థంగా నడిపించాడు. బాబర్ కెప్టెన్సీలో పాకిస్థాన్ మూడు ఫార్మాట్లలో 84 మ్యాచ్‌లు నెగ్గింది. పాక్ క్రికెట్‌లో రెండో అత్యుత్తమ కెప్టెన్‌గానూ నిలిచాడు. కానీ, గత ఏడాదిగా పాకిస్థాన్ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. గతేడాది జరిగిన వన్డే వరల్డ్‌కప్, 2024లో జరిగిన టీ20 వరల్డ్‌కప్ టోర్నీల్లో పాకిస్థాన్ ఘోరంగా విఫలమైంది.



# ఐసీసీ నెంబర్ వన్ టెస్ట్ బౌలర్‌గా బుమ్రా

- రెండో స్థానానికి అశ్విన్
- బ్యాటర్లలో మూడో స్థానానికి జైస్వాల్, ఆరో స్థానానికి కోహ్లీ
- ఆల్ రౌండర్ల జాబితాలో జడేజా టాప్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచ నెంబర్ వన్ టెస్ట్ బౌలర్‌గా భారత ఆటగాడు జస్ప్రీత్ బుమ్రా నిలిచాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో బుమ్రా అద్భుత ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే.

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బుధవారం టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో బౌలింగ్ విభాగంలో భారత జట్టు పేసర్ జస్ప్రీత్ బుమ్రా 870 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే 869 పాయింట్లతో రవిచంద్రన్ అశ్విన్ రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఇక బ్యాటింగ్ విభాగంలోనూ టీమ్ ఇండియా బ్యాటర్ యశస్వీ జైస్వాల్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 792 రేటింగ్స్‌తో మూడో స్థానంలో నిలిచాడు. అలాగే కోహ్లీ ఏకంగా 6 స్థానాలు మెరుగుపర్చుకుని ఆరో ప్లేస్‌లో ఉన్నాడు.

భారత్ బంగ్లాదేశ్ మధ్య జరిగిన రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో ఫాస్ట్ బౌలర్ బుమ్రా అద్భుత ప్రదర్శనతో 11 వికెట్లు కూల్చాడు. బుమ్రా టెస్ట్ నెంబర్ వన్ బౌలర్‌గా నిలువడం ఇది రెండోసారి. ఇంతకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్ అనంతరం నెంబర్ అగ్రస్థానానికి చేరాడు. కాన్పూర్ టెస్టులో బుమ్రా మొత్తం ఏడు వికెట్లు తీయగా, అశ్విన్ ఐదు వికెట్లు తీశాడు.

బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన యువ బ్యాట్స్‌మెన్ యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. ఇప్పుడు 792 పాయింట్లు అతని ఖాతాలో ఉన్నాయి. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 47.25 సగటుతో 189 పరుగులు చేశాడు.మూడు అర్ధ సెంచరీలను సాధించాడు. బ్యాట్స్‌మెన్ టెస్టు ర్యాంకింగ్స్‌లో జో రూట్ అగ్రస్థానంలో ఉన్నాడు. కేన్ విలియమ్సన్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.ఇక టీమిండియా సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ 6వ స్థానానికి చేరుకున్నాడు. చెన్నై టెస్టులో 6, 17 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరిన కోహ్లీ.. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ టాప్-10లో చోటు దక్కలేదు. కాన్పూర్ టెస్టులో పునరాగమనం చేసిన విరాట్ 47, 29 (నాటౌట్) పరుగులు చేసి విజయంలో కీలక పోషించాడు. దాంతో ఐసీసీ ఆరు స్థానాలు ఎగబాకి 6వ ప్లేస్‌కి చేరాడు. ఇక రిషబ్ పంత్ 9వ స్థానంలో ఉన్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ టాప్-10లో చోటు కోల్పోయాడు. ప్రస్తుతం 15వ ప్లేస్‌కి చేరాడు.

### ఆల్ రౌండర్లలో జడేజా టాప్

అలాగే టెస్టు ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా ప్లేయర్ రవీంద్ర జడేజా 468 రేటింగ్స్‌తో మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టు కున్నాడు. తర్వాతి స్థానాల్లో అశ్విన్, షకీబ్ అల్ హసన్, జో రూట్, మెహిదీ హసన్ నిలిచారు.



# ఖో ఖో తొలి ప్రపంచకప్‌కు భారత్ అతిథ్యం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అంతర్జాతీయ ఖో ఖో ఫెడరేషన్‌తో కలిసి భారత ఫెడరేషన్ చరిత్రలోనే మొట్టమొదటి వరల్డ్ కప్‌ను భారత్ వేదికగా నిర్వహించనున్నారు. 2025లో ఈ పోటీలు జరగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ టోర్నీలో 24 దేశాలు పాల్గొననున్నాయి. మొత్తం 16 పురుష, మహిళా జట్లు పోటీల్లో తలపడే అవకాశం ఉంది. 2032 ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకోవడమే లక్ష్యమని ఖో ఖో ఇండియా ప్రకటన చేసింది.

'భారత్?లో తొలి ప్రపంచకప్ నిర్వహించేందుకు మేం సంతోషిస్తున్నాం. ఈ వరల్డ్‌కప్ కేవలం పోటీల కోసమే కాదు. ప్రపంచంలోని వివిధ దేశాలను ఒక్కతాటిపైకి తెచ్చి, ఈ క్రీడకు విశ్వవ్యాప్తంగా క్రేజ్ తీసుకురావడమే మా లక్ష్యం. ఒలింపిక్స్‌లో ఖో ఖో ఆటను చూడడం మా కల. ఆ కల సాకారం చేసుకోవడానికి ఈ వరల్డ్‌కప్ నిర్వహణ తొలి అడుగు' అని ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సుదాంశూ మిత్తల్ పేర్కొన్నారు.

అయితే ప్రపంచకప్‌కు ముందు ఈ ఆటను మరింత ఎక్కువ మందికి చేరేలా ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రణాళిక రచిస్తోంది. దాదాపు 10 నగరాల్లో 200 పాఠశాలలల్లో ఖో ఖో గేమ్‌ను ప్రమోట్ చేయాడానికి ప్లాన్ చేస్తోంది. వరల్డ్‌కప్ పోటీలకు ముందు ఓ స్పెషల్ డ్రైవ్‌తో దేశంలో కనీసం 50 లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలని టార్గెట్‌గా పెట్టుకుంది.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..













